## • రైతుభరోసా కోసం అన్నదాతల ధర్నా



ఇబ్రహీంపట్నం, జూన్ 23 : రైతు భరోసా కోసం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం రైతులు, బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, మాజీ ఎంపీపీ కృపేష్, సహకారసంఘం చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము కూడా రైతులమని, రైతు భరోసా ఎందుకివ్వరని ప్రశ్నించారు. ఎలిమినేడు శివారు ప్రాంతాల్లోని గ్రామాల రైతులకు వెంటనే రైతుభరోసా అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## • సచివాలయం ఎదుట రైతుల ఆందోళన



హైదరాబాద్, 23 (నమస్తే తెలంగాణ): సచివాలయం వద్ద రైతులు ఆందోళనకు దిగడం సంచలనం సృష్టించింది. తమకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతులు పెద్దఎత్తున సచివాలయం వద్దకు చేరుకొని, సౌత్‌ఈస్ట్ గేట్ ముందు ఆందోళన చేపట్టారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ హయాంలో 700 ఎకరాలకు పట్టా ఇచ్చారని, ఇంకా 1,100 ఎకరాలకు పట్టా ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరితే పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొన్నారు. తాము ఎన్నో ఏండ్లుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ భూములుగా నమోదుచేయడంతో పాస్ పుస్తకాలు రాలేదని, దీంతో రైతుభరోసా, రైతుబీమా, రుణమాఫీ వంటి పథకాలు అందడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

## 26సార్లు ఫోన్‌చేసినా స్పందించరా?


- కలెక్టర్‌పై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అసహనం
- ఎమ్మెల్యేలు ఏం చెప్పినా వింటరా?
- ఎమ్మెల్యే ఒత్తిడి, తప్పుడు నివేదికలతో కలెక్టర్ నిర్ణయాలు
- సమస్యలపై కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు



నల్లగొండ, జూన్ 23: నల్లగొండ కలెక్టర్ తీరుపై నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ప్రజా సమస్యలపై నివేదించేందుకు 26 సార్లు ఫోన్ చేసినా ఒక్కసారి కూడా అందుబాటులోకి రాకపోవడంపై మండిపడ్డారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలవటానికి ప్రయత్నించగా ఆమె అపాయింట్‌మెకంట్ ఇవ్వకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. ఆ వెంటనే గ్రీవెన్స్ హాల్‌లోకి వెళ్లి కలెక్టర్‌పై అసహనం వ్యక్తంచేశారు. తాను నకిరేకల్ ఎమ్మెల్యేగా రెండుసార్లు ఎన్నికయ్యానని, నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉన్న తాను పలు సమస్యలపై విన్నవించటానికి 26 సార్లు ఫోన్ చేస్తే ఎత్తి సమాధానం ఇవ్వకపోవటం సరికాదనడంతో పోలీసులు ఆయన్ను హాల్ నుంచి బయటకు పంపారు. ఈ సందర్భంగా చిరుమర్తి మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్‌కు నకిరేకల్ సమస్యలు విన్నవించటానికి 26 సార్లు ఫోన్ చేసినా ఆన్సర్ చేయకపోవడంతో నేరుగా వచ్చినా సమయం ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, చిన్నకాపర్తి మాజీ సర్పంచ్ వాణిశ్రీ అర్జీలను కలెక్టర్ పట్టించుకోకుండా దాటవేస్తూ స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడితో వారిని రాజకీయంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు ఆరోపించారు. అధికార పార్టీ నేతల అండదండలతో కొందరు అధికారులు తప్పుడు నివేదికలు రూపొందిస్తూ ఇటీవల కేతెపల్లి పంచాయతీ కార్యదర్శిపై వేటు వేశారని తెలిపారు. కాంగ్రెస్ నేతలు అధికారుల అండదండలతో చిన్నకాపర్తి మాజీ సర్పంచ్ వ్యవసాయ క్షేత్రంలో భవనాలను నేలమట్టం చేయించినట్టు చెప్పారు. అధికారులు ఎమ్మెల్యేలకు తొత్తులుగా మారి బీఆర్ఎస్ నాయకులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. అధికారులు పరిధి దాటి పనిచేస్తే కేసీఆర్ సీఎం అయ్యాక మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లా?

- ఇందిరమ్మ కమిటీలు అవకతవకలకు పాల్పడ్డాయి
- గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట పిండిప్రోలు గ్రామస్థుల ధర్నా
- ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి దిగ్బంధం
- భారీగా నిలిచిన వాహనాలు



అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పిండిప్రోలు గ్రామస్థులు, మహిళలు

తిరుమలాయపాలెం, జూన్ 23 : ఇందిరమ్మ కమిటీలు ఇండ్ల మంజూరులో అవకతవకలకు పాల్పడుతూ అనర్హులకు ఇండ్లు మంజూరు చేశాయని ఆరోపిస్తూ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామస్థులు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. వీరికి మద్దతుగా బీఆర్ఎస్, సీపీఎం నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పిండిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిని దిగ్బంధించి రాస్తారోకో చేపట్టడంతో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మహిళలతో చర్చించగా తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో షేక్‌శిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం సమర్పించారు. పిండిప్రోలులో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, జాబితానుంచి అనర్హులను తొలగించి అర్హులైన పేదలందరికీ ఇండ్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని వినతిపత్రంలో కోరారు.

## ఇల్లియ్యకుండా అన్యాయం చేస్తరా?

- నేను కాంగ్రెస్ కార్యకర్తను, దివ్యాంగుడిని
- మొదటి జాబితాలో పేరొచ్చినంక తొలగిస్తరా?
- పెద్దపల్లిలో కలెక్టర్‌కు ఫిర్యాదు



కాంగ్రెస్ కార్యకర్త మధునయ్య

ధర్మారం, జూన్ 23: 'నేను కాంగ్రెస్ కార్యకర్తను. దివ్యాంగుడిని. అయినప్పటికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో నాకు అన్యాయం జరిగింది' అంటూ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌పేటకు చెందిన జవ్వాజి మధునయ్య వాపోయాడు. ఈ మేరకు ఆయన సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుడినైన తాను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇల్లు మంజూరైనట్టు గతంలో జరిగిన గ్రామసభలో అధికారులు ప్రకటించినట్టు తెలిపాడు. తుది జాబితాలో తన పేరు గల్లంతైందని ఆవేదన వ్యక్తంచేశాడు. పంచాయతీ కార్యదర్శిని అడిగితే అర్హుల జాబితా ఉన్నతాధికారులను పంపామని, వారే మంజూరు చేస్తారని చెప్పి తప్పించుకున్నారని పేర్కొన్నాడు. తనకు ఇంటి స్థలంతోపాటు అన్ని అర్హతలు ఉన్నాయని చెబితే కార్యదర్శికి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని కలెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో తెలిపారు. ఎలాంటి విచారణ జరపకుండానే పలువురికి ఇండ్లు మంజూరు చేయడమే కాకుండా, ఈ నెల 16న నిర్మాణాలకు ముగ్గు పోశారని వివరించారు. ఇదివరకు గృహ నిర్మాణ పథకంలో లబ్ధి పొంది, ఇండ్లు కట్టుకొని అమ్ముకున్నవారికి అధికారులు ఇండ్లు మంజూరు చేశారని, తానేం పాపం చేశానని మధునయ్య వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో భగీరథ నీటిని సరఫరా చేయాలని రోడ్డుపై ఆందోళన చేస్తున్న గిరిజనులు

# కాళ్లు మొక్కుతం.. నీళ్లందించండి

- ఎస్సై కాళ్ల మీద పడి వేడుకున్న గిరిజనులు
- నెలరోజులుగా వేధిస్తున్న నీటి సమస్య
- కెరమెరిలో ఖాళీబిందెలతో రోడ్డెక్కిన గ్రామస్థులు



నీళ్లదించండి సారూ.. అంటూ ఎస్సై కాళ్లపై పడి వేడుకుంటున్న గిరిజనుడు

కెరమెరి, జూన్ 23: 'సారూ.. మీ కాళ్లు మొక్కుతాం..మాకు తాగునీళ్లు అందించండి' అంటూ గిరిజనులు ఎస్సై కాళ్ల మీద పడి వేడుకున్నారు. ఈ ఘటన సోమవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలో జరిగింది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, తాగునీటి ఎద్దడి తీర్చాలంటూ కెరమెరిలోని ప్రధాన రహదారిపై జోడేఘాట్, పాట్నాపూర్, బాబేఝరి, శివాగూడ, పాటగూడ, పిట్టగూడ, కొలాంగూడ గ్రామాలకు చెందిన సుమారు వంద మంది గిరిజనులు బైఠాయించి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నెల రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా లేక గోస పడుతున్నామని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే దారిలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ రాగా ఆయనకు విన్నవించేందుకు ప్రయత్నించగా వాహనం ఆపకుండా వెళ్లిపోయారు. అనంతరం ఎస్సై మధుకర్ కాళ్లపై పడి నీళ్లందించాలని వేడుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారమయ్యేలా చూస్తానని ఎస్సై హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి మండల పరిషత్ కార్యాలయం వద్దకు వెళ్లి ఆందోళన కొనసాగించారు. నీటి సరఫరా ఏఈ విశ్వేశ్వర్ వచ్చి ట్యాంకర్ల ద్వారానైనా నీటిని అందిస్తామని హామీ ఇవ్వడంతో గిరిజనులు శాంతించారు.

## ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలి

- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి


హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి.. మావోయిస్టు ప్రతినిధులతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి రాజ్‌భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు ఏఐవైఎఫ్ కార్యకర్తలకు గాయాలు కాగా, కార్యకర్తలను అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ.. దండకారణ్యంలో మావోయిస్టులతోపాటు, గిరిజనుల నెత్తురు ఏరులై పారుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టేందుకే ఈ నరమేధాన్ని కేంద్రం సృష్టిస్తున్నదని ఆరోపించారు. కేంద్రప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## • బకాయి ఫీజులు చెల్లించాలని కలెక్టరేట్ల వద్ద ధర్నా



సంగారెడ్డి కలెక్టరేట్/కంఠేశ్వర్, జూన్ 23: రెండేండ్లుగా బకాయి ఫీజులు చెల్లించకపోవడంతో బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యకు తమ పిల్లలు దూరం అవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సంగారెడ్డి, నిజామాబాద్ కలెక్టరేట్ల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజులు బకాయి పడటంతో యాజమాన్యాలు తమ పిల్లలను పాఠశాలకు రావొద్దని చెప్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.200 కోట్లు బకాయి ఉన్నట్టు పేర్కొన్నారు. బకాయిలను చెల్లించి పేద, గిరిజన విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## • ఉపాధ్యాయులను నియమించాలని ఆందోళన



హన్వాడ, జూన్ 23 : ప్రభుత్వ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని టంకరవాసులు మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టంకర జడ్పీహెచ్ఎస్‌లో 230 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా.. నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని తెలిపారు. హిందీ, సోషల్, సైన్స్‌తో పాటు మరిన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువులో వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ఇప్పటికే నాలుగు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అనంతరం కలెక్టర్ విజయేందిరబోయికి వినతిపత్రం అందజేయగా.. స్పందించిన ఆమె పాఠశాలను తనిఖీ చేస్తానని హామీ ఇచ్చారు.

## • సమస్యలు పరిష్కరించాలని 'ఏజీయూ'లో ఆందోళన

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 23: విద్యార్థుల స్కాలర్‌షిప్ పెంచడంతోపాటు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఎదుట పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోమవారం విద్యార్థులు అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ముట్టడించి.. రెండు గంటల పాటు రహదారిపై బైఠాయించారు.



## • ఖమ్మం కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా




ఖమ్మం, జూన్ 23 : కేంద్రం తెచ్చిన పెన్షన్ సవరణ బిల్లును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఈజేఏసీ చైర్మన్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పెన్షన్ సవరణ బిల్లు పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించేలా ఉన్నదని అన్నారు.